క్లుప్తంగా

ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులు



రోడ్డును నిర్మిస్తున్న కార్మికులు

అమలాపురం టౌన్: అమలాపురం యర్రమిల్లి వారి వీధిలో శ్రీదేవి అమ్మవారి ఆలయం సమీపంలోని మలుపు నుంచి ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలమైంది. 12వ వార్డులోకి వచ్చే ఈ రోడ్డును ఆధునీకరణకు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు అనేక సార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. ఎట్టకేలకు ఆ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల నిధులుకేటాయించారు. దీంతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. వ్యాపార కూడలి అయిన ఆ రోడ్డులో అనేక దుకాణాలు కూడా ఉన్నాయి. నిత్యం వేలాది మంది ఇదే రోడ్డులో ప్రయాణిస్తూ ఉంటారు. శిథిలమైన ఆ రోడ్డును కొన్నేళ్ల తర్వాత ఆధునీకరిస్తున్నందుకు ఆ ప్రాంత దుకాణాల వ్యాపారులే కాకుండా స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఆనందిస్తున్నారు.

నిత్యావసరాల వితరణ



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అల్లవరం: దేవగుప్తం ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి ఏక్ కదమ్ అవుర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, బియ్యం, దుస్తులను గురువారం పంపిణీ చేశారు. గోడిలోని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు తంగెళ్ల శ్రీను, ఏక్ కదమ్ అవుర్ ఫౌండేషన్ మేనేజర్ మాసా శ్రీను బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదంలో నిరాశ్రయులైన దివ్యాంగులు బుంగ జ్యోతి, బుంగ బేబిలకు ఫౌండేషన్ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. బేబిని దత్తత తీసుకుని చదవుకి అయ్యే ఖర్చు భరిస్తామని తల్లిదండ్రులు చిట్టిబాబు, మారతమ్మలకు భరోసా ఇచ్చారు. అలాగే ఇంటి నిర్మాణానికి నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతు శంకరాచార్యులు, నాగభూషణం తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



గురుబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్రీలక్ష్మీ గణపతి వస్త్ర వ్యాపార సంఘం సభ్యుడు కేశనకుర్తి గురుబాబు కుటుంబ సభ్యులు సంఘం తరఫున రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ముమ్మిడివరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, వస్త్ర వ్యాపార సంఘ అధ్యక్షుడు వస్త్రాల సూర్యనారాయణల ఆధ్వర్యంలో గురుబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. చింతక్రింద రామకృష్ణ, వస్త్రాల బాబి, తాళ్ల విశ్వేశ్వరరావు,నూకల మణి, విళ్ల చలపతి, పబోలు కుమార్ దితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని 33–11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా తాళ్లరేవు, సీతారామపురం, కోరంగి, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జీపేట, నీలపల్లి, గాడిమొగ, చినవలసల, పెదవలసల, పత్తిగొంది, చిన్నబొడ్డు వెంకటాయపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉప్పలగుప్తం: చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం మండలంలోని ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భట్టుపాలెం, సుధాపాలెం, మంచెంవారిపాలెం, గంధంవారిపాలెం, నంగవరం, భీమనపల్లి, విలసవిల్లి, సింగరాయపాలెం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేతన వెతలు

- జీతాలందక సమ్మె బాట పట్టిన చెత్త టిప్పర్ల డ్రైవర్లు
- అమలాపురంలో నిలిచిన ఇంటింటా చెత్త సేకరణ
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మున్సిపాలిటీలో అరకొరగా సేవలు



అమలాపురంలో సమ్మె చేస్తున్న చెత్త ఆటో టిప్పర్ డ్రైవర్లు

అమలాపురం టౌన్: జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో చెత్తను తీసుకెళ్లే ఆటో టిప్పర్ల డ్రైవర్లు సమ్మె బాట పట్టారు. జీతాలు లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కింద అమలాపురం మున్సిపాలిటీకి గత ప్రభుత్వంలో కేటాయించిన 12 ఆటో టిప్పర్ల డ్రైవర్లు ఇప్పుడు సమ్మె చేస్తున్నారు. గత మూడు నెలలుగా జీతాలు లేక తమ అనుబంధ సంస్థ ఏఐటీయూసీ ద్వారా మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును అనేక సార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో గత మూడు రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. మున్సిపాలిటీ వద్ద 12 టిప్పర్లను నిలిపివేసి నిరసన తెలుపుతున్నారు. టిప్పర్ల డ్రైవర్ల గౌరవాధ్యక్షుడు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు మున్సిపల్ కమిషనర్‌తో గురువారం కూడా చర్చలు జరిపారు. గురువారం సాయంత్రానికి డైవర్లకు ఒక నెల జీతం పడుతుందని, ఈ లోగా విధుల్లోకి రావాలని కమిషనర్ కోరారు. ఒక నెలైనా, మొత్తం పెండింగ్ జీతాలైన తమ అకౌంట్లలో పడిన తర్వాతే విధుల్లోకి వస్తామని డ్రైవర్లు భీష్మించారు. కమిషనర్ అభ్యర్థనను కూడా పక్కన పెట్టి సమ్మెను కొనసాగిస్తున్నారు.

చెత్త పన్ను వసూళ్ల నిలిపివేయడంతో

గత ప్రభుత్వంలో గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు చెత్త సేకరణపై నామ మాత్రపు పన్ను వసూల అమలులో ఉండేది. అప్పట్లో ప్రభుత్వం క్లాప్ కింద టిప్పర్ల నిర్వహణ బాధ్యతలు ఓ ఏజెన్సీకి అప్పగించింది. ఏజెన్సీ టిప్పర్ల డ్రైవర్లకు జీతాలు ఇస్తూ టిప్పర్ల నిర్వహణ బాధ్యతులను చేపట్టేది. ఏజెన్సీకి ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్ట్ ప్రకారం నిధులు చెల్లించేది. ప్రతి నెలా చెత్త పన్ను వసూల చేసి ప్రభుత్వానికి మున్సిపాలిటీ చెల్లించేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్తపై పన్ను వసూళ్లను నిలిపివేయాలని ఆదేశాల జారీ చేసింది. దీంతో చెత్త పన్ను వసూళ్ల లేక, ప్రభుత్వానికి చెల్లించిక పోవడంతో ఏజెన్సీకి చెల్లింపులను ప్రభుత్వం నిలిపివేసింది. ఇక్కడ నుంచి చెత్త కష్టాలు మొదలయ్యాయి. పోనీ టిప్పర్ల జీతాలు మున్సిపాలిటీయే చెల్లించాలని సూచిస్తూ ప్రభుత్వం ఆదేశాలు కూడా ఇవ్వడం లేదు. ఓ పక్క ఏజెన్సీ ఇవ్వక, ప్రభుత్వమూ చెల్లించక, మున్సిపాలిటీ భరించక మధ్యలో టిప్పర్ల డ్రైవర్లు జీతాలు లేక అప్పుల పాలవుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. గత్యంతరం లేక సమ్మె బాట పట్టి టిప్పర్లను నిలిపేశామని డ్రైవర్లు తెలిపారు.

అరకొరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

క్లాప్ టిప్పర్ల డ్రైవర్లు సమ్మె చేయడంతో మున్సిపాలిటీలో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా అరకొరగానే సాగుతోంది. ఎందుకంటే టిప్పరు ఉంటే చిన్న రోడ్డులోనూ, సందులోనూ ఉన్న చెత్తను సేకరించడానికి అవుతుంది. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లతో ట్రాక్టర్ వెళ్లతగ్గ రూట్లలోనే చెత్త సేకరణ జరుగుతోంది. వీధుల్లోనూ సందుల్లోనూ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు దుర్వాసనను భరించలేక ఇబ్బంది పడుతున్నారు. టిప్పర్ల డ్రైవర్లు సమ్మెకి దిగడంతో మున్సిపల్ ట్రాక్టర్లతో చెత్తను సేకరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆర్డీఓ మాధవికి ఆహ్వానం



ఆర్డీవో మాధవిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వచ్చే నెల 9వ తేదీన అమలాపురంలో జరగనున్న వాకర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆర్డీఓ కొత్త మాధవిని వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు గురువారం ఆహ్వానించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమెను వాకర్స్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. అనంతరం ఆర్డీవో మాధవిని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవర ప్రసాద్ తదితర బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, డాక్టర్ గొలకోటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య బాల రాముని ఆలయ వార్షికోత్సవం



అయోధ్య బాల రామునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో తొలి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ సమేత భక్తాంజనేయస్వామి మూర్తులకు కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ అర్చకులు పూజలు చేశారు. దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి జై శ్రీరామ్ నినాదాలతో వైశ్యులు హోరెత్తించారు. వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, వైశ్య సంఘం ప్రతినిధులు వంకాయల కాశీ, వరదా సూరిబాబు, నంబూరి మూర్తి, కొమ్మూరి ప్రసాద్, పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాస్ తదితరులు పాల్గొని బాల రాముడికి ప్రత్యేక పూజలు చేశారు.

పంజాలో వైఎస్సార్ సీపీ నేతల ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు బులినాని, షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు

అమలాపురం టౌన్: హిమామ్ జాఫర్ సాధిక్ అలై ఇస్లామ్ పేరుతో జరుగుతున్న కుండే (నోములు) కార్యక్రమంలో భాగంగా స్థానిక ముజఫర్ లైన్ వీధిలోని పంజాలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొని గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అరబిక్ మాసం రజబ్ నెలలో జరిగే ఈ నోములను పంజా ధర్మకర్త కర్రార్ హుస్సేన్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, స్థానిక వార్డు కౌన్సిలర్ సంసాని బులినాని, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యురాలు షేక్ సుల్తానా ఖ్వాజా ఈ నోముల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏటీవో అలీ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అందరూ హిమామ్ జాఫర్ సాధిక్ అలై ఇస్లామీ ప్రసాదాన్ని స్వీకరించారు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్



సచివాలయం రోడ్డులో కుక్క కళేబరం

అల్లవరం: ప్రతి మూడో శనివారం పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ దివస్ కార్యక్రమం అబాసుపాలైంది. ప్రకటనలకే తప్ప ఆచరణలో అమలుకాదని బోడసకుర్రులో పంచాయతీ నిరూపించింది. ఈ నెల 18వ తేదీన బోడసకుర్రు పంచాయతీ పరిధిలో నియోజకవర్గ స్థాయి అధికారి రాంబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రతి మూడో శనివారం తప్పక పాటించాలని అవగాహన కల్పించారు. ఇంకా వారం రోజులు పూర్తి కాకుండానే స్వచ్ఛ దివస్‌కు మంగళం పాడారు. ఇటీవల నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం ఆనుకుని ప్రధాన రహదారిపై వీధి కుక్క చనిపోయింది. చనిపోయిన కుక్కని తొలగించకుండా పారిశుధ్య కార్మికులు పట్టించుకోలేదు. దీంతో కుక్క కళేబరం నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. దుర్గంధమైన వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కార్యదర్శి పట్టించుకోవడం స్థానికంగా నివాసం ఉంటున్న గ్రామస్తులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

దివ్యాంగ పింఛన్లపై తనిఖీ



మోదుకూరులో దివ్యాంగ పెన్షన్‌దారుడికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దివ్యాంగ పెన్షన్‌దారుల తనిఖీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పొందుతున్న 32 మంది ఇంటికి ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృంద సభ్యులు ఎస్.అశోక్, సీబీవీ సారథి తదితరులు లబ్ధిదారుల దివ్యాంగత్వాన్ని పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 11 మంది దివ్యాంగులకు గాను 10 మందికి, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 22 మందికి గాను 12 మందికి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన వారికి ఈ నెల 27న వికలాంగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన దవులూరి సాయి రామ కృష్ణ ఆయన కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116లు సమర్పించినారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

రాజోలు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం సహకారంతో కడలి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సంఘ జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి విద్యార్థులకు అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సఖినేటిపల్లి: గుడిమూల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కొల్లాబత్తుల తాతారావు(80) తలకు తీవ్ర గాయమైంది. అతడిని మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు గురువారం తెలిపిన వివరాల మేరకు, గ్రామంలో తాతారావు కాలినడకన వెళుతుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి మోటార్ బైక్‌తో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన తాతారావును అతడి కోడలు స్పందన మలికిపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాతారావు చనిపోయాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేపు అమలాపురం రైతు బజార్ పునఃప్రారంభం

- కూరగాయలతోపాటు చేపల దుకాణాలకు అవకాశం
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి, పలు శాఖల జిల్లా అధికారులు

అమలాపురం టౌన్: మూతపడిన అమలాపురం రైతు బజార్‌ను పూర్తి స్థాయిలో ఆధునీకరించి శనివారం పునఃప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. గతంలో కేవలం కూరగాయల దుకాణాల మాత్రమే ఉన్న ఈ బజార్‌లో చేపలు, మాంసం దుకాణాలతోపాటు డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులు విక్రయించేలా వెసులబాటు కల్పించి బజార్‌ను ఆధునీకరించినట్టు పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.విశాలాక్షితోపాటు సహకార శాఖ, పౌర సరఫరాల శాఖ, డీఆర్‌డీఏ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ మహేష్‌కుమార్ రైతు బజార్‌ను గురువారం సాయంత్రం పరిశీలించారు. రైతు బజార్‌లో 55 మంది రైతులు కూరగాయల దుకాణాలు, మాంసం, చేపలకు సంబంధించి 15 దుకాణాలు, స్వయం సహాయక సంఘాలు ఇళ్ల వద్ద కుటీర పరిశ్రమల ద్వారా ఉత్పత్తులను విక్రయించుకునే ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అన్నారు. అద్దె ప్రాతిపదికన రెండు కిరాణా దుకాణాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడతున్నట్టు చెప్పారు. అలాగే రైతు బజార్‌కు వచ్చే రహదారిని, పాడైపోయిన దుకాణాలను తక్షణమే ఆధునీకరించాలని కలెక్టర్ మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్, డీఆర్‌డీఏ పీడీ శివ శంకర ప్రసాద్, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



సభలో మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ



సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌పీఓ మునిస్వామి, అధికారులు

అమలాపురం టౌన్: భరత మాత దాస్య శృంఖలాలు ఛేదించడానికి దేశం నుంచి బ్రిటీషు వారిని తరిమికొట్టిన మహోన్నత వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోసు అని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన నేతాజీ జయంతి సభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ మాట్లాడారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన జయంతి సభలో హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, కోనసీమ జేఏసీ ప్రతినిధి కరాటం ప్రవీణ్ ప్రసంగిస్తూ నేతాజీ వీరత్వాన్ని, దేశానికి అందించిన సేవలు, త్యాగాలను గుర్తు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.గంగరాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో

స్థానిక మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి (పరాక్రమ్ దివస్) స్థానిక గోఖలే వీధిలో జరిగింది. విశ్రాంత సైనికోద్యోగి గోటేటి గంగాధరరావు అధ్యక్షతన జరిగిన జయంతి సభలో క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి తదితరులు నేతాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పుత్సా రాజేశ్వరి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, పేరి లలిత, శ్రీగిరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం నేతాజీ

యానాం: దేశ చరిత్రలో కీర్తికిరీటాల్లో నిలిచిపోయిన కొద్దిమంది నేతల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రముఖులని ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌పీఓ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నేతాజీసుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాస్య శృంఖలాల్లో మగ్గుతున్న భారతీయులకు అభయహస్తం అందించి నూతనోత్తేజాన్ని నింపారని జాతీయోద్యమం వైపు ప్రజలను ఆకర్షితులని చేసి బ్రిటీష్‌వారికి సింహస్వప్నమై సుదీర్ఘ స్వాతంత్ర్యోద్యమ పోరాటం చేసి కనుమరుగయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్సై .శేరు నూకరాజు, పీఆర్‌ఏఓ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

పీఎఫ్ఎంఎస్ ఏపీఓ రమ్య ప్రసన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఓ రమ్య ప్రసన్న

ముమ్మిడివరం: బిల్లులు మంజూరు, ఖర్చు విషయంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని రాష్ట్ర పీఎఫ్ఎంఎస్ ఏపీఓ ఎస్.రమ్యప్రసన్న పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాషా అధ్యక్షతన గురువారం సమగ్ర శిక్షా ఐటీ సిబ్బంది, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమ్య ప్రసన్న మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ అభివృద్ధి సేవా కార్యక్రమాలతో పాటుగా ఉద్యోగుల జీత భత్యాలకు ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులను సక్రమంగా సమర్ధవంతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకుంటే ఆర్థ/ క వ్యవస్థపై పెనుభారం పడుతుందన్నారు. ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఉన్న మండలస్థాయి సిబ్బందికి, సమగ్ర శిక్షా సిబ్బందికి జీత భత్యాలతో పాటు స్కూల్, ఎమ్మార్పీ, సమగ్ర పథకాలకు కోట్లాది రూపాయలు ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ నిధులను ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ నిధులను హెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఏఏవోలు దూళిపూడి మనోహరి, పాండ్రంకి రవికుమార్ జిల్లా, మండల కార్యాలయాలకు మంజూరయ్యే నిధులను ఖర్చు చేసే విధానం, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో వ్యయం, జమల నిర్వహణ తదితర విషయాలపై శిక్షణ నిచ్చారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న కాకినాడ జిల్లా సిస్టమ్ అనలిస్ట్ సత్యశ్రీ రోమణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎఫ్ఏఓ వారణాశి పద్మావతి, సమగ్ర శిక్షా ఏపీవో డాక్టర్ ఎంకే బీమారావు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, సమగ్ర శిక్షా కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ప్రయాణం.. కావాలి సురక్షితం

- మోటార్ బైక్‌పై యువ జంట బ్లైండ్ ఫోల్డ్ ర్యాలీ
- రోడ్డు నియమాలపై వినూత్న ప్రచారం



కళ్లకు గంతలతో బైక్‌పై ర్యాలీ చేస్తున్న మోహిత్, సీత

రావులపాలెం: ఆ యువ జంట వైద్యులే. అంతేగాక ఇంద్రజాలికులు కూడా. త్వరలో జీవితంలో ఒక్కటి కావాలని నిర్ణయించుకున్నారు. జీవన ప్రయాణం ఎలా సాగుతుందో తెలియదు కానీ.. కళ్లకు గంతలతో మోటారు బైక్‌పై ఎంత భద్రంగా ప్రయాణిస్తామో మాత్రం వారికి కచ్చితంగా తెలుసు. సమాజానికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించేందుకు ఈ జంట కళ్లకు గంతలు కట్టుకుని డ్రైవ్ చేస్తూ అందరినీ అబ్బురపరిచారు. ఈతకోట టోల్ ప్లాజా ఆధ్వర్యంలో 36వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో రావులపాలేనికి చెందిన శ్యామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ డాక్టర్లు, యువ ఇంద్రజాలికులైన ఫిజియోథెరపిస్టులు మోహిత్, సీత ఈ వినూత్న ప్రచారం చేశారు. ఇద్దరూ బ్లైండ్ ఫోల్డ్ ర్యాలీ నిర్వహించారు. ఈతకోట నుంచి రావులపాలెం పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ కొనసాగింది. ముందుగా ఈతకోట టోల్ ప్లాజా వద్ద ప్రాజెక్ట్ మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్‌ప్లాజా మేనేజర్ కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డిలు మోహిత్, సీత కళ్లపై కరాచీ నూక వేసి, కళ్లకు గంతలు కట్టి, శిరస్సుకు హెల్మెట్లు ధరింపజేశారు. అనంతరం వారు టోల్ ప్లాజా నుంచి హైవేపై బైక్ నడుపుతూ, రోడ్డు నియమాలపై నినాదాలు ప్రదర్శిస్తూ రావులపాలెం పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ చేశారు. సీఐ శేఖర్‌బాబు వారిని అభినందించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు శ్యామ్ జాదుగర్ పాల్గొన్నారు.

గల్ఫ్ యువ నేస్తం ఆర్థిక సాయం



నాగశ్రీనుకు ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

మలికిపురం: పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం కంచిమర్రు గ్రామానికి చెందిన గుబ్బల నాగశ్రీను వైద్య ఖర్చుల కోసం రాజోలు కేంద్రంగా పని చేస్తున్న గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి సభ్యులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. సమితి ద్వారా రూ.20 వేలు, కట్టా శ్రీనివాస్ రూ.వెయ్యి, తుందుర్తి కుమార్‌రాజు రూ.500 మొత్తం రూ.21,500ను అందించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కండిబోయిన రమేష్, గుబ్బల రామకృష్ణ, కట్టా వాసు, వేండ్రరమణ, లక్ష్మి, కాండ్రేగుల లక్ష్మీనరసింహమూర్తి, కడలి కష్టార్జునుడు, దొంగ సత్తిబాబు, కాండ్రేగుల నాగరాజు, కడలి బాలకృష్ణ పాల్గొన్నారు.